
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం : 16 : ఏప్రిల్ : 2025



నాసిరకం విత్తనం..

పలు కంపెనీలకు చెందిన ఆడ, మగ మొక్కజొన్న విత్తనాలు జూలూరుపాడు, టేకులపల్లి మండలాల రైతులను నిండా ముంచాయి. 8లో



సుముహూర్తాలు వచ్చేశాయ్..

ఈనెలలో పెళ్లి ముహూర్తాలు ఎక్కువగా ఉన్నాయని, 14 నుంచి 30వ తేదీ వరకు మంచి రోజులని పండితులు చెబుతున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
38^{0} / 25^{0}

వాతావరణం


జిల్లాలో బుధవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. సాయంత్రం కొన్ని చోట్ల జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

సమ్మక్క బ్యారేజీ నుంచి నీరు విడుదల



సమ్మక్క-సారక్క బ్యారేజీ

సూపర్‌బజార్(కొత్తగూడెం)/అశ్వాపురం : జిల్లాలో తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా సమ్మక్క సాగర్ బ్యారేజీ నుంచి నీరు విడుదల చేయనున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం తెలిపారు. అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలోని దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీరు అడుగంటుతోందని, దీంతో రానున్న రోజుల్లో తాగునీటికి ఇబ్బంది కలుగకుండా మిషన్ భగీరథ, ఇరిగేషన్ అధికారుల సమన్వయంతో తుపాకులగూడెంలోని బ్యారేజీ నుంచి 300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశామని వివరించారు. ఏప్రిల్, మే నెలల్లో తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

భద్రాద్రి తలంబ్రాలకు ఆదరణ



భద్రాచలంఅర్బన్ : భద్రాచలం శ్రీ సీతారాముల కల్యాణ తలంబ్రాలను కొనుగోలు చేసే భక్తుల సంఖ్య ఈ ఏడాది భారీగా పెరిగింది. శ్రీరామనవమికి భద్రాచలం రాలేని భక్తుల ఇంటివద్దకే తలంబ్రాలు అందించాలని ఆర్టీసీ కార్గో సంకల్పించింది. గత నెల 15 నుంచి ఈనెల 7 వరకు రూ.151 చెల్లించి బుక్ చేసుకున్న వారికి కార్గో సిబ్బంది తలంబ్రాలు అందించారు. ఈ విషయాన్ని ఆర్టీసీ అధికారులు విస్తృతంగా ప్రచారం చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా భారీగా బుక్ చేసుకున్నారు. గతేడాది ఖమ్మం రీజియన్ వ్యాప్తంగా 4,500 మంది మాత్రమే బుక్ చేసుకోగా ఆర్టీసీకి రూ.6.79 లక్షల ఆదాయం వచ్చింది. ఈసారి 4,948 మంది బుక్ చేసుకోగా రూ.7.47 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా గల 11 ఆర్టీసీ రీజియన్లలో పరిధిలో 2024లో 47,092 బుకింగ్‌లకు రూ.71,10,892 ఆదాయం రాగా, ఈ ఏడాది 82,147 మంది బుక్ చేసుకున్నారు. వీటిలో ఇప్పటివరకు 40 వేల తలంబ్రాల ప్యాకెట్లు కార్గో ద్వారా అందజేయగా రూ.60.40 లక్షల ఆదాయం వచ్చింది. ఇంకా 42 వేల మంది భక్తులకు త్వరలోనే తలంబ్రాలు అందిస్తామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

ఊపందుకున్న ఉపాధి



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

జోరుగా కొనసాగుతున్న పనులు
- నిత్యం 35వేల మంది కూలీల హాజరు
- జిల్లాలో 1.35 లక్షల యాక్టివ్ జాబ్ కార్డులు

చుంచుపల్లి : జిల్లాలో ఉపాధి హామీ పనులు జోరందుకున్నాయి. ఈ పనులకు వచ్చే కూలీల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. వ్యవసాయ పనులు తగ్గుముఖం పడుతుండగా కూలీలు ఈజీఎస్ పనుల వైపు ఆసక్తి చూపుతున్నారు. అయితే ఎండలు పెరుగుతుండడంతో ఉదయమే పనులకు వెళ్లి 11 గంటల లోపే ఇళ్లకు చేరుతున్నారు. ఈ పథకాన్ని ప్రతి వేసవిలో గ్రామీణ ప్రాంత కుటుంబాల వారు ఎక్కువగా సద్వినియోగం చేసుకుంటున్నారు. యేటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఈ పనులు జోరుగా చేపడుతుంటారు. వేసవి కాలంలో పని చేసే కూలీలకు గతంలో కేంద్ర ప్రభుత్వం అదనపు భత్యం ఇచ్చేది. 2022 నుంచి కొత్త సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి వచ్చాక ఈ చెల్లింపులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఉపాధి కూలీలకు రోజుకు రూ.307 చొప్పున చెల్లిస్తున్నారు.

మూడు నెలల్లో 26.21 లక్షల పనిదినాలు..

జిల్లాలోని 481 గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పనులు సాగుతున్నాయి. జిల్లాలో మొత్తం 2.23 లక్షల జాబ్‌కార్డులు ఉండగా, వాటి పరిధిలో 4.58 లక్షల మంది కూలీలు పేర్లు నమోదు చేసుకున్నారు. ఇందులో 1.35 లక్షల యాక్టివ్ జాబ్ కార్డులు ఉండగా, 2.29 లక్షల మంది కూలీలు పనులను సద్వినియోగం చేసుకుంటున్నారు. గతేడాది 52లక్షల పని దినాలను లక్ష్యంగా నిర్ధారించగా, ఈ ఏడాది మొదటి మూడు నెలల్లో 26.21 లక్షల పని దినాలు పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. ప్రతి ఏడాది ఫిబ్రవరి చివరి నుంచి ఉపాధి పనుల సీజన్ మొదలతున్నా ఏప్రిల్ నుంచే కూలీలు ఎక్కువ సంఖ్యలో వస్తుంటారు. గతేడాది 100 రోజుల పనిదినాలు పూర్తి చేసిన కూలీలకు ఈనెల నుంచే మళ్లీ కొత్తగా ఉపాధి పనులు వర్తింపజేస్తారు. ప్రస్తుతం ఒక్కో గ్రామం పరిధిలో సగటున 62 మంది చొప్పున కూలీలు హాజరవుతున్నారు. మార్చి చివరి వారంలో 21,530 మంది కూలీలు రాగా, ఇప్పుడా సంఖ్య 35,623 కు చేరింది. ఇందులో మహిళలే అధికంగా ఉండడం గమనార్హం.

అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు..

ప్రస్తుతం ఉపాధి పనుల్లో భూమి చదును చేయడం, పొలం బాటలు తీయడం, చెరువుల్లో పూడికతీత, నీటి కుంటలు, గ్రావెల్, నర్సరీల పనులు ఎక్కువగా చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధి పనులు ఊపందుకున్న నేపథ్యంలో అధికారులు పని ప్రదేశాల్లో కూలీలకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. పెరుగుతున్న ఎండల దృష్ట్యా నీడ కోసం టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచుతున్నారు.

మండలాల వారీగా వస్తున్న ఉపాధి కూలీల సంఖ్య ఇలా..

ఆళ్లపల్లి	752
అన్నపురెడ్డిపల్లి	1,411
అశ్వాపురం	2,429
అశ్వారావుపేట	2,264
భద్రాచలం	46
బూర్గంపాడు	4,157
చండ్రుగొండ	835
చర్ల	1,381
చుంచుపల్లి	989
దమ్మపేట	1,546
దుమ్ముగూడెం	1,982
గుండాల	711
జూలూరుపాడు	1,239
కరకగూడెం	895
లక్ష్మీదేవిపల్లి	1,256
మణుగూరు	729
ములకలపల్లి	3113
పాల్వంచ	3,714
పినపాక	1,239
సుజాతనగర్	1,314
టేకులపల్లి	2,198
ఇల్లెందు	1,424

పనులు పర్యవేక్షిస్తున్నాం



జిల్లాలో ఉపాధి హామీ పనులు ఊపందుకున్నాయి. పనులకు వచ్చే కూలీల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. గత 15 రోజుల్లో ఈ సంఖ్య మరింతగా పెరిగింది. కూలీలను ఉపాధి పనులకు వచ్చేలా గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. వేసవి దృష్ట్యా అన్ని చర్యలూ తీసుకుంటూ పర్యవేక్షణ చేస్తున్నాం.

– ఎం.విద్యాచందన, డీఆర్డీఓ

కొర్రమేను పెంపకంతో సిరులు

- చేపల పెంపకంలో రాష్ట్రానికే ఆదర్శం కావాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్ పిలుపు



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): సిరులు పండించే కొర్రమేను చేపల పెంపకంతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. కొర్రమేను చేపల పెంపకంపై జిల్లాలోని మహిళా సమాఖ్య సభ్యులు, వ్యవసాయ శాఖ ఏపీఎంలకు కొత్తగూడెం క్లబ్‌లో మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యవసాయం అన్ని సమయాల్లో కలిసిరాక పోవచ్చని, ప్రకృతి సహకరిస్తేనే అధిక దిగుబడులు వస్తాయని అన్నారు. అందుకే ఒకసారి పెట్టుబడితో నిరంతరం ఆదాయం వచ్చే చేపల పెంపకంపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. కొర్రమేను చేప ఎలాంటి వాతావరణానికైనా తట్టుకుంటుందని అన్నారు. వీటి పెంపకానికి ఎక్కువ భూమి కూడా అవసరం లేదని, పావుగుంట స్థలంలో నీటి ట్యాంక్, మరో పావుగుంటలో ఫామ్‌పాండ్ నిర్మిస్తే చాలని, దాణాతో కలిపి మొత్తం సుమారు రూ 3.50 లక్షలతో తయారు చేసుకోవచ్చని వివరించారు. ఒక్కో చేపపిల్ల ఖరీదు రూ.15 ఉంటుందని, 1000 పిల్లలు పెంచితే అందులో 900 చేతికొచ్చినా కిలో రూ.300 చొప్పున ఏడు నెలల్లో రూ.2.70 లక్షలు చేతికొస్తాయని చెప్పారు. ఈ యూనిట్ స్థాపనకు పీఎంఈజీపీ పథకం ద్వారా 35 శాతం సబ్సిడీ వస్తుందన్నారు. ఉపాధి పథకం ద్వారా ఫామ్‌పాండ్ ఉచితంగా నిర్మించుకోవచ్చని అన్నారు. జిల్లాలోని రైతులు, మహిళా సమాఖ్య సభ్యులు అధిక సంఖ్యలో కొర్రమేను చేపల పెంపకం చేపట్టాలని సూచించారు. చేపలకు రోజుకు ఐదుసార్లు దాణా వేయాలని, పిల్లలను నాలుగు నెలలు ట్యాంకర్‌లో పెంచిన తర్వాత వాటిని నీటి కుంటలో వేస్తే పెద్ద పరిణామంలో ఎదుగుతాయని అన్నారు. రైతులు, మహిళా సమాఖ్య సభ్యులు కొర్రమేను చేపల పెంపకం చేపట్టి రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం అక్వా కనెక్ట్ సంస్థ వారు చేపల పెంపకం, మార్కెటింగ్ తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, వ్యవసాయాధికారి బాబూరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మేనేజర్ తిరుపతయ్య, మత్స్య శాఖ ఏడీ ఇంతియాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యం మెరుగుపర్చుకోవాలి

బూర్గంపాడు: మహిళలు సుస్థిర జీవనోపాధుల కోసం వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఐటీసీ మిషన్ సునేహరి కల్ ఆధ్వర్యంలో వృత్తి శిక్షణ కోర్సులు పూర్తిచేసుకున్న మహిళలతో సారపాక రైతు వేదికలో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఒంటరి మహిళలు, వితంతువుల్లో వృత్తి విద్యా నైపుణ్యాలు పెంచేందుకు ఐటీసీ ఎంఎస్‌కే ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. మహిళల జీవనోపాధి మెరుగుపరిచేందుకు ప్రభుత్వ పరంగా కూడా చర్యలు తీసుకుంటామన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ఐటీసీతో కలిసి కొన్ని కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జమలారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రామ్‌నరేష్, ఐటీసీ పీఎస్‌పీడీ జీఎం చెంగలరావు, ఎంఎస్‌కే మేనేజర్ జయప్రకాశ్ పాల్గొన్నారు.

పాలక మండలికి మోక్షమెప్పుడో ?

జీఓ వచ్చి నెల కావొస్తున్నా ప్రమాణస్వీకారం ఊసే లేదు



పెద్దమ్మతల్లి ఆలయం

పాల్వంచరూరల్ : అమ్మవారు వరమిచ్చినా అధికారులు కరుణించని చందంగా ఉంది పెద్దమ్మతల్లి ఆలయ పాలక మండలి పరిస్థితి. ఆలయ పాలకమండలి కోసం 13 మంది పేర్ల జాబితాతో ప్రభుత్వం మార్చి 19న జీఓ నంబర్ 112 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. అయినా దేవాదాయ శాఖ అధికారులు ఇంకా ప్రమాణ స్వీకారానికి మోక్షం కల్పించడం లేదు. జీఓ వచ్చిన ఏడు రోజుల తర్వాత అంటే గత నెల 26న జాబితాలో పేర్లున్న వారందరినీ ప్రమాణస్వీకారోత్సవానికి ఈఓ ఆహ్వానించారు. దీంతో వారంతా ఆలయం వద్ద గల ఈఓ కార్యాలయానికి వెళ్లారు. అయితే స్థానికులకు కమిటీలో అవకాశం కల్పించాలంటూ ఇద్దరు యువకులు గుడి ఎదుట గల వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలపగా, మరి కొందరు ఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. దీంతో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిలిచిపోయింది.

మొదట 14 మందితో..

పెద్దమ్మతల్లి ఆలయ పాలకవర్గం ఎన్నిక విషయంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈసారి ప్రభుత్వం రెండుసార్లు జీఓలు జారీ చేయడం వివాదానికి దారితీసింది. మొదట గతనెల 6వ తేదీన 14 మంది పేర్లతో జాబితా విడుదల చేశారు. అయితే ఈ కమిటీపై వివాదం తలెత్తడం, అధికారులు, మంత్రులకు ఫిర్యాదులు అందడంతో ఆ జీఓను రద్దుచేసి గతనెల 19న జీఓ నంబర్ 112 ద్వారా 13 మందితో కూడిన మరో జాబితా విడుదల చేశారు. ఇప్పుడు ఈ జీఓ వచ్చి కూడా 27 రోజులు కాగా, మరో మూడు రోజుల్లో ఈ జాబితా కూడా రద్దయ్యే అవకాశం ఉందని పాలకమండలిలో చోటు దక్కిన సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఆలయ ఈఓ రజినీకుమారిని వివరణ కోరగా.. పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించాలంటే ఉన్నతాధికారుల నుంచి మరోసారి ప్రొసీడింగ్స్ రావాల్సి ఉందని, రాగానే చేయిస్తామని చెప్పారు.

ట్రెంచ్ పనుల అడ్డగింత



రోడ్డుపై కర్రలు పెట్టి ఆందోళన చేస్తున్న మహిళలు

ఎల్లాపురంలో పోడు వివాదం

ఇల్లెందురూరల్: మండలంలోని మర్రిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఎల్లాపురంలో ఆదివాసీలు, అటవీ శాఖ అధికారుల మధ్య మంగళవారం పోడు వివాదం చోటుచేసుకుంది. అధికారులు సోమవారం ట్రెంచ్ కొట్టే పనులు చేపట్టారు. ఆ పనులు కొనసాగించేందుకు మళ్లీ మంగళవారం వెళ్తుండగా గ్రామ పొలిమేరలోనే ఆదివాసీలు అడ్డుకున్నారు. తమకు పట్టాలున్న భూముల్లో ట్రెంచ్ పనులు ఎలా చేస్తారంటూ అధికారులను నిలదీశారు. అయితే తాము సాగు భూముల జోలికి వెళ్లడం లేదని, అడవికి సరిహద్దుగా మాత్రమే ట్రెంచ్ పనులు చేపట్టామని అధికారులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు వినలేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ భూముల వద్దకు వెళ్లనిచ్చేది లేదని భీష్మించడంతో అటవీ శాఖ అధికారులు వెనుదిరిగారు. అడవికి సరిహద్దుగా ట్రెంచ్ పనులు చేసుకోవాల్సిన అధికారులు.. ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు కలిగి ఉన్న భూముల్లోనూ పనులు చేపట్టారని ఆదివాసీలు ఆరోపించారు. కోతుల బెడద నుంచి పంటలను రక్షించుకునేందుకు ఒక రైతు చెట్ల కొమ్మలను నరికితే దీన్ని సాకుగా తీసుకుని పట్టా భూముల్లో ట్రెంచ్ పనులు చేపట్టడం అన్యాయమని అన్నారు. ఈ విషయమై కొమరారం ఇన్‌చార్జ్ ఎఫ్ఆర్ఓ చలపతిరావును వివరణ కోరగా.. పట్టా భూమి పక్కనే ఉన్న అడవిని కొందరు ఆక్రమించుకునే ప్రయత్నం చేసినట్లుగా గుర్తించామని, అడవికి, పట్టా భూములకు సరిహద్దును నిర్ధారించేందుకే ట్రెంచ్ పనులు చేపట్టామని చెప్పారు. తమ ప్రయత్నాన్ని గ్రామస్తులు అడ్డుకోవడం సరైంది కాదన్నారు.

వసతిగృహాల్లో మెరుగైన సౌకర్యాలు

ఖమ్మంమయూరిసెంటర్/మధిర: గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ వెల్లడించారు. మంగళవారం ఆయన ఖమ్మం జిల్లా మధిర ఎస్టీ జీహెచ్ బాలికల వసతిగృహం, వల్లభి బాలికల వసతిగృహం, ఖమ్మం ఎన్నెస్పీ క్యాంపులోని కళాశాల బాలికల వసతిగృహాల నూతన భవన నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పీఓ మాట్లాడుతూ జీవితంలో అత్యున్నత స్థానాలకు చేరేలా లక్ష్యాలను ఏర్పర్చుకోవాలని సూచించారు. ఇందుకోసం కెరీర్ గైడెన్స్ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. కాగా, మెనూ ప్రకారం భోజనం అందుతోందా, లేదా అని ఆరా తీసిన పీఓ మధిర ఎస్టీజీహెచ్‌లో భోజనం చేశారు.

నాలుగేళ్లకే నేలమట్టమా !

- కుప్పకూలిన 'సీతారామ' ప్యాసేజ్ పిల్లర్
- ఇదేం నాణ్యత అంటూ సర్వత్రా విస్మయం
- అధికారుల నిర్లక్ష్యమే కారణమని రైతుల ఆరోపణ





కూలిపోయిన సూపర్ ప్యాసేజ్ పిల్లర్ (ఇన్‌సెట్) పిల్లర్ కూలడంతో దెబ్బతిన్న కింది భాగం

ములకలపల్లి : సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాలువపై రూ.కోటి వ్యయంతో నిర్మించిన సూపర్ ప్యాసేజ్ పిల్లర్ నాలుగేళ్లకే నేటమట్టం కావడం చర్చనీయాంశంగా మారింది. అధికారుల పర్యవేక్షణ లోపం, పనుల్లో నాణ్యత లేకపోవడమే దీనికి కారణమని స్థానికులు అంటున్నారు. 20 రోజుల క్రితమే పిల్లర్ కూలిందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నా.. సుమారు ఏడాది కాలంగా రాకపోకలు నిలిపివేశారని రైతులు అంటున్నారు. వీకే రామవరం పంప్‌హౌస్ –2 నుంచి కమలాపురంలోని పంప్‌హౌస్ –3కు వెళ్లే ప్రధాన కాల్వపై 48.30 కిలోమీటర్ వద్ద నాలుగు పిల్లర్లతో సూపర్ ప్యాసేజ్ నిర్మించారు. రెండు పిల్లర్లు కాల్వలో, కాల్వకు కుడివైపున సిమెంట్ రివిట్‌మెంట్‌లో ఒకటి, ఎడమ పక్కన మరోకటి నిర్మించారు. ఐతే పూసుగూడెం నుండి కమలాపురం వెళ్లే ప్రధాన కాలువలో ఎడమ పక్కన పిల్లర్ కూలిపోయింది. ఇరిగేషన్ అధికారులు ఇరవై రోజుల క్రితం ఘటన జరిగిందని చెపుతున్నా, సుమారు ఏడాది క్రితమే పిల్లర్ నేటమట్టమైనట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. ఈక్రమంలో అసలు పిల్లర్ ఎలా కూలింది అనే విషయంలోనూ స్పష్టత కరువైంది. పిల్లర్ కింద మట్టి కదిలి, పునాది కదలడంతో పిల్లర్ కూలిపోయిందని ఇరిగేషన్ అధికారులు చెపుతున్నారు. ఒకవేళ ఇదే నిజమైతే కాలువ కుడివైపున రివిట్‌మెంట్‌లో ఉన్న పిల్లర్‌కు కూడా ప్రమాదం పొంచిఉండే అవకాశం ఉంది. ఇదే పద్ధతితో పిల్లర్ బేస్‌మెంట్ కదిలితే ఆ పిల్లర్‌కూడా కూలిపోయే ప్రమాదముందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

గోప్యత ఎందుకో..?

ఏడాది క్రితమే పిల్లర్ నేలమట్టమైందని రైతులు అంటుండగా 20 రోజుల క్రితమే కూలిందని అధికారులు చెబుతున్నారు. అయితే ఈ 20 రోజులు మాత్రం గోప్యత ఎందుకు పాటించారనేది ప్రశ్నార్థకంగా మారింది. పిల్లర్‌ను పునర్నిర్మించాలని యోచిస్తున్న అధికారులు.. కూలిపోవడానికి కారణమేంటని సమగ్ర అధ్యయనం చేశారా లేక ఇష్టారీతిన పనులు సాగిస్తారా అనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ప్యాసేజ్ నిర్మించిన కాంట్రాక్ట్ ఏజెన్సీ పని మొత్తం పూర్తయ్యాక కూడా రెండేళ్ల పాటు నిర్వహణ బాధ్యత చూడాల్సి ఉంటుందని ఇరిగేషన్ ఇంజనీర్లు అంటుండగా.. అసలు పని పూర్తికాకుండానే పిల్లర్ కూలడం నాణ్యతను తెలియజేస్తోంది.

సమగ్ర విచారణ చేపట్టాలి

అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ అలసత్వంతోనే పిల్లర్ కూలిపోయింది. దీంతో ప్రజాధనం వృథా అయింది. రూ.కోటితో నిర్మించిన ప్యాసేజ్ ప్రమాదకర పరిస్థితిలో ఉంది. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– నూపా భాస్కర్, మాస్‌లైన్ నాయకుడు

పనులు ప్రారంభించాం

20 రోజుల క్రితమే పిల్లర్ కూలిపోయింది. తిరిగి ఇప్పటికే పనులు ప్రారంభించాం. బేస్‌మెంట్ లోతు పెంచి, పకడ్బందీగా పిల్లర్ నిర్మిస్తాం. ప్రజాధనం వృథా కాకుండా కాంట్రాక్టరే ఖర్చు భరించేలా చర్యలు తీసుకుంటున్నాం. పిల్లర్ కూలినందునే తాత్కాలికంగా ప్యాసేజ్ దారి మూసేశాం.

– రాంబాబు, ఇరిగేషన్ డీఈ

రజతోత్సవ సభకు కదం తొక్కాలి

సన్నాహక సదస్సులో ఎంపీ రవిచంద్ర



ఇల్లెందు : సభకు రావాలని ఆహ్వానిస్తున్న ఎంపీ వద్దిరాజు, మాజీ ఎమ్మెల్యే హరిప్రియ



దమ్మపేట : పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రవిచంద్ర, రేగా కాంతారావు తదితరులు

ఇల్లెందు: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం యావత్ దేశమే కాదు ప్రపంచంలోని తెలుగు వారంతా ఎదురుచూస్తున్నారని.. ఈ సభకు గులాబీ సైన్యం కదం తొక్కి విజయవంతం చేయాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. ఇల్లెందులో మంగళవారం నిర్వహించిన సన్నాహక సదస్సులో ఆయన మాట్లాడారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలన డొల్ల అని తేలడంతో తెలంగాణకు కేసీఆరే శ్రీరామ రక్ష అని ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. ఎవరెన్ని విమర్శలు చేసినా సూర్యచంద్రులు ఉన్నంత కాలం కేసీఆర్ పేరు తెలంగాణ చరిత్రలో ఉంటుందని చెప్పారు. హామీలేవీ అమలు చేయని రాష్ట్ర ప్రభుత్వం.. తాగునీటి సరఫరా, ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ మేరకు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు తరలిరావాలని ఎంపీ కోరారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు మాట్లాడుతూ అధికారులు కాంగ్రెస్ నేతలకు వత్తాసుగా ఉంటే బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక చర్యలు తప్పవన్నారు. హనుమకొండ సభను బీఆర్ఎస్ శ్రేణులు పండుగగా భావించాలని సూచించారు. ఆ తర్వాత ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, దిండిగాల రాజేందర్ తదితరులు ఇల్లెందు 8వ వార్డులో ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి సభకు రావాలని ఆహ్వానించారు. ఇంకా ఈ సమావేశంలో మహబూబాబాద్ జెడ్పీ మాజీ చైర్మన్ అంగోతు బిందు, సేవాలాల్ సేన వ్యవస్థాపకులు సంజీవనాయక్, లక్కినేని సురేందర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, గత ఎన్నికల్లో ఇల్లెందు టికెట్ ఆశించిన సేవాలాల్ సేన వ్యవస్థాపకుడు సంజీవనాయక్ ఈ సభకు హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది.

రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసింది కేసీఆరే..

దమ్మపేట : సాగునీటి ప్రాజెక్టులతో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని ఎంపీ రవిచంద్ర అన్నారు. మండలంలోని పార్కలగండిలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ పోరాడి తెలంగాణ తేవడం వల్లే నేడు రేవంత్ రెడ్డి సీఎం అయ్యారని అన్నారు. అమలు కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ప్రజల విశ్వసనీయతను కోల్పోయిందని అన్నారు. మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఇబ్బంది పెడుతున్న అధికారులు ఆ తర్వాత మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ సభకు నియోజకవర్గం నుంచి 1000 మందిని తరలిస్తామని తెలిపారు. అనంతరం రజతోత్సవ సభ పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సోయం వీరభద్రం, సున్నం నాగమణి, వగ్గెల పూజ, రావు జోగేశ్వరరావు, దారా యుగంధర్, తూతా నాగమణి, దొడ్డా రమేష్, జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, దారా మల్లికార్జునరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏపీ ప్రభుత్వ సలహాదారుడిగా దమ్మపేట వాసి



పసుమర్తి మల్లికార్జున్‌రావు

దమ్మపేట: ఏపీలోని అటవీ అభివృద్ధి కార్యకలాపాలకు సంబంధించి సలహాలు, సూచనలు ఇచ్చేందుకు దమ్మపేట గ్రామానికి చెందిన రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి పసుమర్తి మల్లికార్జునరావును నియమించారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయనను సలహాదారుడుగా నియమిస్తూ మంగళవారం జీఓ జారీ చేసింది. మల్లికార్జునరావు గతంలో ఏపీలో ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టుగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు.

ఘనంగా అర్చక సంఘం ఆత్మీయ సమ్మేళనం



ఐడీ కార్డులను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర నాయకులు

పాల్వంచ: పట్టణంలోని అల్లూరి సెంటర్ వరలక్ష్మి ఫంక్షన్ హాల్లో మంగళవారం జిల్లా ధూప, దీప, నివేదన ఆత్మీయ అర్చక సంఘం సమ్మేళన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నావరుజుల ప్రసాద్‌శర్మ, అధికార ప్రతినిధి మరింగంటి భార్గవాచార్యులు ఆధ్వర్యంలో నూతన అధ్యక్షులు పురాణం కిరణ్‌కుమార్‌శర్మ, ప్రధాన కార్యదర్శి పాడికంటి సంతోష్ కుమార్, కోశాధికారిగా కౌత ప్రసాద్‌శాస్త్రి, కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం పంచాంగ ఆవిష్కరణ చేయించి ఐడీ కార్డులు ఆవిష్కరించారు.

పాస్టర్‌కు గిన్నిస్‌బుక్‌లో స్థానం



సర్టిఫికెట్ అందుకుంటున్న ఏసుదాసు

పాల్వంచ: గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో పాల్వంచ వాసి, కాంట్రాక్టర్స్ కాలనీ ఇండియన్ పెంతికోస్తే చర్చి పాస్టర్ మత్రి ఏసుదాసు స్థానం పొందారు. ఇటీవల హైదరాబాద్ మణికొండలో న్యూలైఫ్ చర్చ్‌లో జరిగిన, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన సరళీ స్వరాలు కీబోర్డ్ ప్లే చేసినందుకు స్థానం పొందారు. నిర్వాహకులు ఆగస్టీన్ దండింగి వేణుగోపాల్ చేతులమీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు. మంగళవారం పలువురు ఏసుదాసును అభినందించారు.

వేసవిలో దాహం తీర్చే చలివేంద్రం



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎస్ఈ మహేందర్

టేకులపల్లి: వేసవిలో ప్రజల దాహం తీర్చేందుకు ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాలు ఎంతో ఉపయోగకరమని అన్నదానం తర్వాత జలదానం అనేది గొప్ప కార్యమని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.మహేందర్ అన్నారు. మంగళవారం పిండిపోలు రామయ్య సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని బొమ్మనపల్లిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈ రంగస్వామి, సేవా సంస్థ గౌరవ అధ్యక్షుడు, బొమ్మనపల్లి సబ్‌స్టేషన్ ఏఈ పిండిపోలు బుజ్జి కన్నయ్య, ఏడీఈ హేమచంద్రబాబు, దేవ్‌సింగ్, నాగుల్‌మీరా, చరణ్, షకీల్, వసీం, యాకూబ్, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

కేసు నమోదు

ములకలపల్లి: చంపుతామని బెదిరింపులకు పాల్పడిన ఘటనలో మంగళవారం పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. ఎస్‌హెచ్‌ఓ ప్రకాష్ రావు కథనం మేరకు.. చాపరాలపల్లి గ్రామానికి చెందిన అర్జున్‌రావు తన ఇంటి ఆవరణలో పశువుల షెడ్డు నిర్మించుకొంటుండగా అదే గ్రామానికి చెందిన బాణోతు బాలాజీ దుర్భాషలాడాడు. అనంతరం ఇంటి ప్రహరీని బద్ధలు కొడతామని, ట్రాక్టర్ ఎక్కించి చంపుతామని బెదిరించారు. అర్జున్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్య

నేలకొండపల్లి: తల్లిదండ్రులు మందలించారనే మనస్తాపంతో ఇంటర్ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మండలంలోని నాచేపల్లికి చెందిన నల్లగొండ యశ్వంత్(18) ఇటీవల ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాశాడు. ఆతర్వాత తల్లిదండ్రుల మాట వినకుండా ఇష్టం వచ్చినట్లుగా తిరుగుతున్నట్లు తెలియగా, వారు మందలించారు. దీంతో బౌద్ధక్షేత్రం వద్ద ఓ వెంచర్‌లో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో తల్లిదండ్రులు చేరుకుని కన్నీరుమున్నీరుగా రోదించగా.. తండ్రి రాంబాబు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నాసిరకం విత్తనం..
రైతు పతనం..

రైతులను నిండా ముంచిన మొక్కజొన్న

- నాణ్యత లేని విత్తనాలతో బెండు కంకులు
- లబోదిబోమంటున్న రైతులు
- ముఖం చాటేస్తున్న విత్తన కంపెనీ డీలర్లు, ఆర్గనైజర్లు, ఏజెంట్లు





వినోభానగర్‌లో దెబ్బతిన్న మొక్కజొన్న పంట (ఇన్‌సెట్) టేకులపల్లి: విత్తనాలు లేని మొక్కజొన్న కంకులు

జూలూరుపాడు: పలు కంపెనీలకు చెందిన ఆడ, మగ మొక్కజొన్న విత్తనాలు రైతులను నిండా ముంచాయి. మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఆడ, మగ మొక్కజొన్న పంటను సుమారు 1000 ఎకరాల్లో సాగు చేయగా.. వినోభానగర్‌లో 400 ఎకరాల్లో పంట వేశారు. విత్తనాలు వేసే సమయంలో వివిధ కంపెనీల డీలర్లు, ఆర్గనైజర్లు, ఏజెంట్లు రైతులకు మాయమాటలు చెప్పి పంటను కొనుగోలు చేస్తామని, పంట పండకపోతే పరిహారంగా రూ.75,000 నుంచి రూ.80 వేలు ఇస్తామని, పెట్టుబడి సాయంగా ఎకరానికి రూ.20,000ల నుంచి రూ.30,000 నగదు ఇవ్వడం, ఎకరానికి 3.5 – 4 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని, మెట్రిక్ టన్నుకు రూ.33,000 నుంచి రూ.35,000 ఇస్తామని, ఎకరానికి రూ.లక్ష లాభం వస్తుందని నమ్మబలికారు. 90 – 100 రోజుల్లో పంట చేతికి వస్తుందని ఆశపడిన రైతులు ఆడ, మగ మొక్కజొన్న పంటను సాగు చేశారు. కంపెనీల ప్రతినిధులు కొందరికి ఒప్పంద పత్రాలు ఇచ్చి.. మరికొందరికి ఇవ్వకుండా దాటవేశారు. రైతులకు పెట్టుబడి సాయంగా కంపెనీ వారు ఇచ్చిన నగదుకు సంబంధించి ఖాళీ ప్రామిసరీ నోట్‌పై సంతకాలు తీసుకున్నారు. మూడు నెలల్లో ఏపుగా పెరిగిన మొక్కజొన్న మొక్కలకు విత్తనాలు లేని బెండు కంకులు వచ్చాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. వినోభానగర్‌లో సుమారు 150 ఎకరాల్లో పంట దెబ్బతినడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. డీలర్లు, ఆర్గనైజర్లు, ఏజెంట్లకు ఫోన్ చేస్తే తమకు ఏమీ తెలియదన్నట్లు వ్యవహరిస్తున్నారని, ఫోన్ కూడా ఎత్తడం లేదని, గట్టిగా నిలదీస్తే ఏమైనా చేసుకోండంటూ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. తాము సంతకాలు చేసిన ఖాళీ ప్రామిసరీ నోట్లు సంబంధిత కంపెనీలకు చెందిన డీలర్లు, ఆర్గనైజర్లు, ఏజెంట్ల వద్ద ఉండటం ఆందోళన కల్గిస్తోందని రైతులు వాపోతున్నారు. సంబంధిత మొక్కజొన్న కంపెనీలపై వ్యవసాయశాఖ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా, మండల వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఆడ, మగ మొక్కజొన్న పంటలను పరిశీలించి, న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఓ విత్తన కంపెనీ ప్రతినిధులు ఆడ, మగ మొక్కజొన్న విత్తనోత్పత్తి కోసం రైతులకు సాగు ఖర్చులు ఇచ్చి పంట పండిన తరువాత కొనుగోలు చేస్తామని రైతులతో ఒప్పందం చేసుకున్నారు. మంగళితండాకు చెందిన ఆంగోతు సేవ్యా 10 ఎకరాలు, తేజావత్ పూల్‌సింగ్ ఎకరం, దారావత్ నాగ రెండున్నర, తేజావత్ దళ్‌సింగ్ 3, లాకావత్ రాజు 2, లాకావత్ రాజేశ్ ఒకటి, రెడ్డి 3, శంకర్ 3, గుగులోత్ రాంజీ ఒకటి, కోటేశ్వర్‌రావు 2, మోతీలాల్ 7, నారాయణ 2, భూక్య రాములు 2, భూక్య దశరథ్ 7.. చుక్కాలబోడు, గోలియాతండా తదితర గ్రామాలకు చెందిన సుమారు వందకుపైగా రైతులు 1,500కు పైగా ఎకరాల్లో ఆడ, మగ మొక్కజొన్న సాగు చేశారు. పంట దెబ్బతింటే ఎకరానికి రూ.70 వేలు, పండితే క్వింటాకి రూ.2,600 చొప్పున కొనుగోలు చేస్తామని చెప్పారు. ఒప్పందం ప్రకారం ప్రతి రైతు బ్యాంకు ఖాతాలో సాగు ఖర్చు కోసం రూ.20 వేలు వేసింది. రైతులు సాగు చేశారు. మూడు నెలల్లో రావాల్సిన పంట నాలుగు నెలలు పట్టిందని, అది కూడా కంకి పూత, కాత సరిగా రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో రైతులు పంటను కోసి సిద్ధంగా ఉంచారని కంపెనీ ప్రతినిధులకు ఫోన్ చేస్తే రావడం లేదని, స్పందించడం లేదని వాపోయారు. నమ్మించి ఆశ పెట్టి తీరా పంట పాడైతే కంపెనీ ప్రతినిధులు స్పందించడం లేదని, ఇప్పటికే వేల రూపాయలు, శ్రమ పోయిందని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు.

ఖాళీ ప్రామిసరీ నోట్‌పై సంతకం పెట్టా..



ఓ విత్తన కంపెనీ వారు ఆడ, మగ మొక్కజొన్న పంట సాగుకు పెట్టుబడి సాయంగా ఎకరానికి రూ.20 వేలు చొప్పున 5.5 ఎకరాలకు డబ్బులు ఇచ్చారు. నగదు ఇచ్చిన తరువాత ఖాళీ ప్రాంసరీ నోట్‌పై సంతకం పెట్టి కంపెనీ ఆర్గనైజర్‌కు ఇచ్చాను. కంపెనీ ఆర్గనైజర్ చెప్పిన మాయమాటలు విని పత్తి పంటను తొలగించి ఆడ, మగ మొక్కజొన్న పంట సాగుచేస్తే విత్తనాలు లేని బెండు కంకులు రావడంతో తీవ్రంగా నష్టపోయాను.

–గంగావత్ లక్ష్మణ్, రైతు వినోభానగర్

పరిహారం ఇస్తామని చెప్పారు..



ఆడ, మగ మొక్కజొన్న పంట పండకపోతే నష్ట పరిహారంగా ఎకరానికి రూ.80 వేలు ఇస్తామని చెప్పారు. కంపెనీ డీలర్లు, ఆర్గనైజర్లు, ఏజెంట్లకు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదు. పలుమార్లు ఫోన్ చేస్తే గానీ లిఫ్ట్ చేస్తున్నారు. కానీ, నష్ట పరిహారం గురించి మాట్లాడటం లేదు. ఈ అంశంపై వ్యవసాయశాఖ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశాం. విత్తన కంపెనీలపై ఇప్పటికైనా చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలి.

–భూక్యా బాలు, రైతు, వినోభానగర్

అధిక దిగుబడి వస్తుందని నమ్మించారు..



ఓ కంపెనీకి చెందిన విత్తనాలు వేస్తే బెండు కంకులు రావడంతో తీవ్ర నష్టం వచ్చింది. 40 శాతం పండి 60 శాతం పండకపోతే ఎకరానికి రూ.80 వేలు ఇస్తామని చెప్పారు. విత్తనకంపెనీ వారు నాణ్యతలేని విత్తనాలు ఇచ్చి మోసం చేశారు. బాండు పేపర్ రాసి ఇస్తామని చెప్పి ఇవ్వలేదు. పంట పెట్టుబడి కోసం ఎకరానికి రూ.20 వేలు ముందుగా ఇచ్చి ఖాళీ ప్రాంసరీ నోట్‌పై సంతకం పెట్టించుకొని తీసుకున్నారు. ఇప్పుడు ప్రాంసరీ నోట్ అడిగితే ఇవ్వడం లేదు.

–భూక్యా రాంబాబు, రైతు, వినోభానగర్

సుముహూర్తాలు వచ్చేశాయ్..

- ఏప్రిల్‌లో బలమైన ముహూర్తాలు
- నేటి నుంచి 30 వరకు పెళ్లిళ్ల సీజన్
- వివాహాలతో కళకళలాడనున్న మండపాలు



భద్రాచలంఅర్బన్: ప్రతి ఒక్కరి జీవితంలో పెళ్లి అనేది ముఖ్యమైన, మహోన్నతమైన ఘట్టం. నూతన వధూవరులు నూరేళ్లు కలిసి జీవించాలంటే ముహూర్త బలం ఉండాలని పెద్దలు చెబుతుంటారు. అందుకే మంచి ముహూర్తం కోసం ఎదురు చూస్తుంటారు. ఇలాంటి వారికి ఈ నెలలో సుముహూర్తాలు ఉన్నాయి. పెళ్లిళ్ల సీజన్ వచ్చిందంటే సాధారణంగా ఒక నెలలో ఒకటి, రెండూ, మూడూ లేదా నాలుగైదు ముహూర్తాలు ఉంటాయి. కానీ, ఏప్రిల్‌లో వచ్చినన్ని ముహూర్తాలు గతంలో ఎప్పుడూ రాలేదు. ఏప్రిల్‌లో ఏకంగా 9 పెళ్లి ముహూర్తాలు ఉన్నట్లు పండితులు చెబుతున్నారు. ఒకే నెలలో ఇన్ని మంచి రోజులు ఉండడం చాలా అరుదు. ఏప్రిల్ 1 నుంచి 13 వరకు మూఢాలు. ఈ సమయంలో ఎలాంటి శుభకార్యాలు నిర్వహించరు. ఆ తర్వాత 9 ముహూర్తాలు ఉన్నాయి. ఏప్రిల్ 14, 16, 18, 19, 20, 21, 25, 29, 30 తేదీల్లో ముహూర్తాలు ఉండటంతో వేలాది వివాహాలు జరగనున్నాయి. ఏప్రిల్‌లో 13వ తేదీ నాటికి మూఢాలు వెళ్లిపోతాయి. సూర్యుడు కుంభం నుంచి మీన రాశిలోకి ప్రవేశిస్తున్నాడు. అంటే ఏప్రిల్‌లో 13 తేదీ వరకు అంటే దాదాపు సగం రోజులు పెళ్లి ముహూర్తాలు లేవు. కానీ, ఆ తర్వాత మరో సగం రోజుల్లో అంటే కేవలం 16 రోజుల్లో 9 ముహూర్తాలు ఉన్నాయి.

ఏప్రిల్ ప్రత్యేకం

ఏప్రిల్‌లో మొత్తం తొమ్మిది ముహూర్తాలు ఉన్నాయి. ఇంత ఎక్కువగా పెళ్లి ముహూర్తాలు చాలా అరుదుగా వస్తుంటాయి. సాధారణంగా పెళ్లి ముహూర్తం కుదరాలంటే చాలా అంశాలను పరిశీలించాలి. జాతకాలు, గ్రహస్థితి, తారాబలం, వధూవరుల గణన, రాశిఫలం ఇలా ఎన్నో అంశాలు కలిస్తేనే ఒక మంచి పెళ్లి ముహూర్తం సెట్ అవుతుంది. మీ ఇంట్లో పెళ్లి వేడుక చేయాలనుకుంటే ఏప్రిల్‌లో మంచి ముహూర్తం కుదురుతుందంటున్నారు. ఈ ముహూర్తాల్లో ఏదో ఒకటి కచ్చితంగా సెట్ అవుతుందని పండితులు చెబుతున్నారు. మార్చి 30 ఉగాది నుంచి విశ్వావసు నామ సంవత్సరం ప్రారంభమవుతుంది. విశ్వావసు నామ సంవత్సరం చైత్రమాసం, బహుళ పక్షం పాడ్యమి తిథి నుంచి మంచి ముహూర్తాలు ప్రారంభమవుతున్నాయి. వారి జాతక రీత్యా ఏఏ నక్షత్రానికి మంచి ముహూర్తం ఉందో తెలుసుకుని ముహూర్తాలు నిర్ణయించుకోవచ్చని పండితులు పేర్కొంటున్నారు.

మంచి తరుణం



పెళ్లిళ్లు చేసుకునేందుకు విశ్వావసు నామ సంవత్సరం ఏప్రిల్‌లో మంచి ముహూర్తాలు ఉన్నాయి. వారి వారి జాతకాల రీత్యా సరిపడా ముహూర్తాలు పెట్టుకోవచ్చు. పెళ్లి ముహూర్తాల కోసం ఎదురుచూస్తున్న వారికి ఇది మంచి తరుణం.

–విశ్వనాథశర్మ, అర్చకులు, భద్రాచలం

చోరీ కేసుల్లో ముద్దాయిలకు జైలు

కొత్తగూడెంటౌన్: పలు చోరీల కేసుల్లో నిందితులకు జైలు శిక్ష విధిస్తూ మంగళవారం కొత్తగూడెం రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.సాయిశ్రీ తీర్పు చెప్పారు. 2023, ఫిబ్రవరి 8న విద్యానగర్‌కాలనీకి చెందిన దేవవరపు వెంకటేశ్వరరావు ఇంట్లో రూ.60 వేల విలువైన ఫోన్‌లు చోరీకి గురికాగా.. న్యాయవాది ఎమ్మెస్సార్ రవిచంద్ర టూవీలర్ చోరీకి గురైంది. చుంచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఐదుగురు సాక్షులను విచారించిన జడ్జి మహబూబాబాద్ జిల్లా కురవి మండలం లింగాల తండాకు చెందిన మాలోత్ రూప్లాకు 9 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. అలాగే, విద్యానగర్‌కాలనీలోని గుడి హుండీలోని రూ.3 వేలు చోరీచేసిన అభియోగంపైనా విచారణ అనంతరం రూప్లాకు పైశిక్షను ఖరారు చేశారు.

మరో కేసులో..

కొత్తగూడెం త్రీటౌన్ పరిధి గాజులరాజంబస్తీకి చెందిన ఈడ్పుగంటి రవీంద్రకుమార్ ఇంట్లో రూ.44 వేల విలువైన బంగారం చోరీకి గురికావడంతో కూలీలైన్‌కు చెందిన షేక్ ఇర్ఫాన్, ఇల్లెందుబస్తీకి చెందిన మహ్మద్ అజీమ్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఎడుగురు సాక్షుల విచారణ అనంతరం మహ్మద్ అజీమ్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధించారు. కాగా, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోనే బంగారు గొలుసు చోరీపై దాఖలైన కేసును సైతం విచారించిన న్యాయమూర్తి.. అందులోనూ నిందితుడైన ఇర్ఫాన్‌కు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్‌ను విశ్వశాంతి నిర్వహించగా, కోర్టు లైజన్ ఆఫీసర్ వీరబాబు, కోర్టు డ్యూటీ పీసీబీ రామకృష్ణ, శోభన్ సహకరించారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు



మావోయిస్టులకు వ్యతిరేకంగా అంటించిన పోస్టర్లు

దుమ్ముగూడెం: మండలంలోని సీతానగరం, పెద్దనల్లబల్లి, ములకపాడు గ్రామాల్లో మావోయిస్టు పార్టీకి వ్యతిరేకంగా ఆదివాసీ యువజన సంఘం పేరిట మంగళవారం వాల్‌పోస్టర్లు వెలిశాయి. అందులో మావోయిస్టుల్లారా! నిత్యం ఆదివాసీలపై ఆధారపడి బతికే మీకు.. అడవులే ఆధారంగా జీవనోపాధి పొందుతున్న ఆదివాసీలను అడవుల్లోకి రావొద్దని చెప్పే అధికారం ఎవరిచ్చారు?.. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను నియంత్రించే అధికారం మీకెక్కడిది?.. మీరు అమర్చిన మందుపాతరల వల్ల ఇప్పటికే చాలామంది అమాయక ఆదివాసులు చనిపోయారు.. ఎందరో శాశ్వత అంగవైకల్యానికి గురయ్యారు.. ఇన్ఫార్మర్ల నెపంతో దారుణ హత్యలు చేస్తున్నారు.. ఇలాంటి దుశ్చర్యలు ఆపకపోతే పోరాటం చేస్తామని పోస్టర్లలో ఉంది.

ఆలయ హుండీ చోరీకి యత్నం



ఆలయం నుంచి బయటకు తీసుకొచ్చిన హుండీ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామ శివారులోని శ్రీచిలకలగండి ముత్యాలమ్మ ఆలయంలో మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగులు చోరీకి యత్నించిన ఘటన చోటుచేసుకుంది. ఆలయం లోపల ఉన్న ఐరన్ హుండీని గుర్తుతెలియని దుండగులు సుమారు 15 మీటర్ల దూరంలో ఆలయం వెనక వైపునకు తీసుకెళ్లి తాళాలను తెరిచేందుకు యత్నించగా.. తెరుచుకోకపోవడంతో అక్కడే వదిలేసి వెళ్లారు. ఉదయం ఆలయానికి వచ్చిన సిబ్బంది గుర్తించి, స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్‌ఐ యాకూబ్‌అలీ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. కాగా, ఇటీవల వచ్చిన గాలి దుమారంతో ఆలయంలోని సీసీ కెమెరాలు కాలిపోగా, చోరీకి వచ్చిన దుండగులను గుర్తించేందుకు వీలు లేకుండా పోయింది.

పోలీస్ స్టేషన్ ఎదుట మహిళల ఆందోళన

అక్రమంగా కేసు పెట్టారంటూ ఆరోపణ



పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించిన కొర్ర నీరజ

కొత్తగూడెంటౌన్: తనపై పోలీసులు అక్రమంగా కేసు పెట్టారని ఆరోపిస్తూ ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో టూటౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించింది. తనకు న్యాయం జరిగే వరకు కదలనని భీష్మించింది. బాధితురాలు కొర్రా నిరోష మాట్లాడుతూ.. సుజాతనగర్ మండలం సర్వారం నంద తండాకు చెందిన తన భర్త కానిస్టేబుల్ అని, తమ మధ్య గొడవలు ఉన్నాయని తెలిపింది. ఈ క్రమంలో మరో మహిళతో కావాలని తనపై ఏప్రిల్ 11న అక్రమ కేసు పెట్టించారని, తన భర్త డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తుండటంతో తనకు పోలీసులు మద్దతు ఇవ్వడం లేదని ఆరోపించింది. ఈ విషయమై టూటౌన్ సీఐ రమేశ్‌కుమార్‌ను వివరణ కోరగా ఏప్రిల్ 11వ తేదీన రామవరానికి చెందిన మహిళ తనను కొర్ర నీరజ కొట్టిందని కేసు పెట్టిందని తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి ఒత్తిడి లేదని, నిరాధార ఆరోపణలు చేస్తోందన్నారు. ప్రస్తుతం కేసు విచారణలో ఉందన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్



నిందితులను చూపుతున్న పోలీసులు

పినపాక: ప్యాసింజర్ ఆటోలో గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఈ–బయ్యారం పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ రాజ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని ఉప్పాక బ్రిడ్జి వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా ఆటోలో లోకేశ్, ఆదిత్య గంజాయిని తరలిస్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. పోలీసులు వారిని వెంబడించి పట్టుకుని, వారి వద్ద నుంచి 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

అన్యమత ప్రచారంపై పోలీసులకు ఫిర్యాదు

ములకలపల్లి : ఏజెన్సీ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలను అగౌరవపరుస్తూ ఓ వ్యక్తి అన్యమత ప్రచారానికి పాల్పడుతున్నాడని రాజీవ్‌నగర్ గ్రామస్తులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మత మార్పిడికి యత్నిస్తున్న అతడిపై చర్య తీసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

పాల్వంచరూరల్: భర్తతో గొడవపడి పురుగులమందు తాగిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. మండలంలోని నాగారంకాలనీకి చెందిన, నవభారత్ కంపెనీలో క్యాజువల్ లేబర్‌గా పనిచేస్తున్న తేజావత్ లాల్‌బాబు భార్య కల్యాణి (26) తన భర్త పనికి రావడం లేదని ఈ నెల 8వ తేదీన పురుగులమందు తాగింది. కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రికి.. అక్కడి నుంచి కొత్తగూడెం ఏరియాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. మృతురాలి తండ్రి భీముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

గ్రామపంచాయతీ ఈఓపై దాడికి యత్నం

ముగ్గురిపై కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం గ్రామ పంచాయతీ ఈఓ శ్రీనివాస్‌పై మంగళవారం ఓ మాంసం వ్యాపారి దాడికి యత్నించాడు. చర్ల రోడ్డులో గల హోండా బైక్ షోరూం ఎదుట ఉన్న ఓ మాంసం దుకాణం కింద ఉన్న డ్రెయినేజీలో పూడికతీత కోసం సిబ్బంది ప్రయత్నించగా సదరు దుకాణం వ్యాపారి అడ్డుకున్నాడు. ఇదే విషయంపై ఈఓ శ్రీనివాస్ సదరు దుకాణం నిర్వాహకుడిని అడిగేందుకు వెళ్లగా ఒక్కసారిగా కుర్చీతో దాడికి యత్నించాడు. మరో వ్యక్తి అక్కడే ఉన్న కర్ర మొద్దులను ఈఓపైకి విసిరేశాడు. పూడికతీతకు వచ్చిన పొక్లెయిన్‌పై దాడికి చేయగా, అద్దం పగిలింది. దీంతో ఈఓ శ్రీనివాస్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ముగ్గురిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

గ్రావెల్ తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు



స్థానికులు అడ్డుకోవడంతో నిలిచిన పొక్లెయినర్, లారీలు

మణుగూరురూరల్: మండలంలోని సాంబాయిగూడెం గ్రామంలో కొందరు ఎలాంటి అనుమతులు లేకుండానే గ్రావెల్ తవ్వకాలు చేపట్టి లారీలు, ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తున్నారు. మంగళవారం గ్రావెల్‌ను తరలిస్తున్న లారీలను గ్రామస్తులు నిలిపి వేసి ఆందోళన చేపట్టారు. లారీలు, ట్రాక్టర్లతో తోలకాలు చేపడుతుండడంతో రోడ్లు పాడైపోయి దుమ్ము, ధూళి ఎగిసిపడి ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. అంతేకాకుండా పర్యావరణానికి నష్టం కూడా వాటిల్లుతోందన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అక్రమ గ్రావెల్ తవ్వకాలు, తోలకాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు డిమాండ్ చేశారు.

కలప పట్టివేత

దుమ్ముగూడెం: మండలంలోని జిన్నెలగూడెం – చింతగుప్ప గ్రామాల మధ్య నిల్వ చేసిన 15 టేకు దిమ్మెలను రేంజర్ కమల ఆధ్వర్యంలో మంగళవారం పట్టుకున్నారు. వాటిని రేంజ్ కార్యాలయానికి తరలించారు. పట్టుకున్న కలప విలువ సుమారు రూ.2 లక్షల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు.

రెండు మట్టి ట్రాక్టర్ల పట్టివేత

జూలూరుపాడు: అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. జూలూరుపాడు ప్రభుత్వ స్థలంలో తవ్విన మట్టిని రెండు ట్రాక్టర్లలో తరలిస్తుండగా స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయ సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, ఇద్దరు డ్రైవర్లు పాపకొల్లుకు చెందిన అశోక్, జూలూరుపాడుకు చెందిన ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. మట్టి ట్రాక్టర్లను తహసీల్దార్‌కు అప్పగించనున్నట్లు ఎస్‌ఐ రవి వెల్లడించారు.